జ్యోతిష్యఫలం

'మల్లిక్'

రాజారావు జ్యోతిష్యాన్ని అసలు నమ్మే వాడు కాదు. ఎవరైనా నమ్మేవాళ్ళు దాన్నిగురించి చెప్తే తిట్టేవాడు.

"అదంతా ఒట్టి బోగస్ డబ్బుకోసం వాళ్ళ నోటికొచ్చినట్లు చెప్తూంటారు కూటికోసం కోటివిద్యలు — అందులో ఇదొకటి" అనేవాడు

కాని ఈ మధ్య అతను పూర్తిగా మారి పోయాడు ఇప్పుడు జ్యోతిశ్శాస్త్రాన్ని రాజారావు నమ్మినంతగా ఇంకెవ్వరూ నమ్మరని చెప్పవచ్చు అతనిలో ఊహించని ఈ మార్పుకలగడానికి కారణమైన ఒక విచిత్రమైన సంఘటన ఉంది రాజారావు స్నేహితు డొకడికి జ్యోతిశ్శాస్త్రం మీద అపారమైన నమ్మకం వుంది ఒక రోజు ఒకానొక తెలుగు దిన పత్రికలో అతదెవరో సుప్రసిద్ధ జ్యోతిష్కుడు సంఘసేవ కోసం నగరానికి వేంచేసినట్లూ—ఫలాని హోటల్లో ఫలాని నంబరు గదిలో వున్నట్టూ, అతను నగరంనుండి వెళ్ళి పోకముందే ఆ మహదవకాశాన్ని వినియోగించుకోవడం కోసం అతనిని కలుసుకోవలసిందిగా ప్రకటింపబడింది

రాజారావు స్నేహితుడు "ఛలో" అన్నాడు రాజారావుతో

రాజారావు "నీకు బుద్ధిలేదూ?" అని అడిగాడు.

"ఇతనిగురించి నీకేం తెలుసు? . ఫలానా ఫలానా గొప్పవారికి ఇతను జోస్యం చెప్పాడు. ఫుట్‌పాత్ మీది చిలక జోస్యంగాళ్ళలా అనుకున్నావా? ఇతను చెప్పినవన్నీ నిజమౌతాయి! .." అంటూ ఇదివరకు ఆ జ్యోతిష్కుడు ఎవరెవరికి ఏమేం చెప్పాడో అవి ఎలా నిజమైనాయో కూడా చెప్పాడు అన్నట్టు అతనికి "జ్యోతిష్క చక్రవర్తి"నో మరేదో బిరుదున్నట్లుకూడా చెప్పాడు.

సరే ఈగందరగోళమంతా స్వయంగా పరికించి ఆ జ్యోతిష్కుడి బండారమంతా బయటపెట్టి తన స్నేహితుడి జ్ఞాన నేత్రాన్ని బలవంతంగానైనాసరే తెరిపించు దామని నిర్ణయించుకున్నాడు రాజారావు ఇద్దరూ కలిపి ఆ జ్యోతిష్కుడి దగ్గరికి బయలుదేరారు

అక్కడ, ఆ హోటలు గదిముందు ఆ జ్యోతిష్కుడిని కలవడానికి బయట ఎదురుచూస్తున్న జనాన్ని చూసి ఆశ్చర్యపోయాడు రాజారావు అయితే ఇతగాడెవరో పెద్దసైజు మోసగాడన్నమాట! అనుకున్నాడు ఈ లోకంలో ఇంతమంది మూఢులున్నారా? అని ఆశ్చర్యపోయాడు

ఆ జోతిష్కుడిని కలవడానికి వారి వంతు వచ్చేటప్పటికి ఒక గంట పట్టింది ఈ గంట కాలంలో రాజారావు "పోదాం లెద్దూ వీడికోసం ఎంతసేపిక్కడ వేచి ఉండాలి" అని ఓ అరవైసార్లు తన స్నేహితుడితో అన్నాడు అతని స్నేహితుడు కూడా "ఛస్ నోర్మూయ్ " అని

అరవై సార్లన్నాడు

తన స్నేహితుడికి జోస్యం చెప్తున్నంతసేపూ రాజారావు ఆ జోతిష్క చక్రవర్తిని గమనిస్తూ కూర్చున్నాడు. రాజారావుకు ఏమనిపించిందంటే అతగాడు ఏదీ తేల్చి చెప్పడు-అవుతే అవుతుంది-లేకపోతే లేదు ఈ మోస్తరుగానే చెప్తున్నట్లు అభిప్రాయపడ్డాడు తనకు నమ్మకం లేకపోయినా ఏమి చెప్తాడో తెలుసుకోవాలన్న కుతూహలాన్ని అణుచుకోలేక రాజారావు తనుకూడా చెయ్యి చూపించుకున్నాడు రాజారావు ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడనీ పెళ్ళయిన తరువాత అతనికి ఏదో లాభం కలగబోతుందనీ చెప్పాడు రాజారావుకు అతని నలభై ఒకటో ఏట నీటిగండం ఉందనీ అది తప్పితే అతనికి డెబ్బైఏళ్ళ ఆయుష్ష అనీ చెప్పాడు రాజారావు అతని మాటలను తేలికగా కొట్టి పారేశాడు

"మీరలా తేలికగా తీసి పారెయ్యడానికి వీలులేదు నేను చెప్పింది అక్షరాల నిజం! మీరు శాంతి చేయిస్తే ఆ గండం తప్పుతుంది" అన్నాడు శాంతి చెయ్యడానికి యాభై రూపాయల వరకూ కర్చు అవుతుందని చెప్పాడు

లేనిపోని భయాలు మనసులో సృష్టించుకుని తను అనవసరంగా డబ్బు కర్చుపెట్ట బోవడంలేదని అన్నాడు రాజారావు.

"అలాగయితే మీకు నలభై ఏళ్ళు నిండిన కొద్దిరోజులకే నీటి గండంవల్ల మరణిస్తారు! " కచ్చితంగా చెప్పాడు ఆ జోతిష్య చక్రవర్తి.

రాజారావు అతనిమీదకు స్రరునలేదాడు అతన్ని నానా దుర్భాషలాడి 'నీ ఫీజుకూడా యివ్వను నీ బాబుతో చెప్పుకో' అన్నాడు రాజారావు స్నేహితుడు అతడిని శాంతింపజేసి మంచి మాటలు చెప్పి అతన్ని బయటకు తీసికెళ్ళి పోయాడు. రాజారావు శాంతి చేయించకుండా వెళ్ళిపోయినందుకు జ్యోతిష్కుడు విచారించాడు

ఆ తరువాత ఓ సంవత్సరానికి రాజా



రావు ఒకమ్మాయి ప్రేమలో పడటమూ, ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవడమూ జరిగింది శోభనం నాటిరాత్రి ఆ జోతిష్కుడు గుర్తుకు వచ్చాడు అటువంటి సమయంలో అతను గుర్తుకు రావడం రాజారావుకు చీకాకు కలిగించింది. ఆ జోతిష్క చక్రవర్తి చెప్పిన విధంగా తను ప్రేమించి పెళ్ళిచేసుకున్నా అతని మీద తనకు ఇంకా నమ్మకం కుదరడం లేదు

"వాడి మొహం వాడేదో నోటి కొచ్చినది చెప్పేశాడు అది అదృష్ట వశాత్తు నిజమైంది। తనే గనుక పెద్ద వాళ్ళను ఎదిరించి ఉండకపోతే ఈ పెళ్ళి అయివుండేదేనా? సుమతిని పెళ్ళి చేసుకోవడం గురించి తను ఎన్ని కష్టాలు పడ్డాడు? సుమతీ అంతే తన తల్లి తండ్రులు వీల్లేదని అన్నాకూడా వాళ్ళ మాటలు లెక్కచెయ్యకుండా తనను చేసుకోవడానికి ముందుకు వచ్చింది అంతే ఇద్దరూ రిజిష్టర్ మ్యారేజ్ చేసుకున్నారు" అనుకున్నాడు రాజారావు

పెళ్ళయిన రెండుమూడు సంవత్సరాలకు రాజారావుకు లాటరీలో ఒకలక్ష తగిలింది అతను ఎగిరి గంతేసాడు ప్రేమించిన అమ్మాయితో పెళ్ళి-సుఖంగా జీవించడానికి కావలసినంత డబ్బు! ఎవరికి మాత్రం ఇంతకు మించి ఏం కావాలి? రాజారావుకు మళ్ళీ ఆ జోతిష్కుడు గుర్తుకు వచ్చాడు.

పెళ్ళయిన తరువాత తనకేదో లాభం కలుగబోతున్నట్లు చెప్పాడతను తనకు లాటరీలో లక్ష రూపాయలు రావటం దాని ఫలితమేనా? ఎలాగయినా జోతిశ్శాస్త్రం అంత పూర్తిగా తీసిపారెయ్యదగినది కాదు। అనుకున్నాడు అప్పుడు అప్పటి నుండీ అతనికి జోతిష్కం మీద కాస్త నమ్మకం ఏర్పడింది అప్పుడప్పుడూ అతను కొంత మంది జోతిష్కుల దగ్గర చెయ్యి చూపించుకోవడం కూడా మొదలు బెట్టాడు వాళ్ళు చెప్పినవన్నీ జరుగుతున్నట్లే అతనికి అనిపించసాగింది వాళ్ళు చెప్పినవేమైనా—నిజమైనా కాకపోయినా రాజారావు మాత్రం తనకు జరిగే సంఘటనలకు జోతిష్కులు చెప్పినదానికి అనుకూలంగా అర్థం కల్పించుకుని ఓ విధమైన సంతృప్తిని అనుభవించడం మొదలు బెట్టాడు

రాజారావుకు జోతిష్కం మీద పూర్తిగా నూటికి నూరు పాళ్ళ నమ్మకం ఏర్పడేటప్పటికి అతని వయసు ముప్పై సంవత్సరాలు అతని గుండె గుభేలుమంది. తను నలభై ఒకటో ఏట నీటి గండంవల్ల మరణిస్తాడని ఆ జోతిష్క చక్రవర్తి చెప్పాడు. అతను చెప్పిన విధంగా తను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళయిన తరువాత తనకేదో లాభం కలగబోతుందని అన్నాడు తనకు లాటరీలో లక్ష తగిలింది? తనకు నలభై ఏళ్ళు నిండిన తరువాత నీటి గండంవల్ల మరణిస్తాడని అన్నాడు ఇది కూడా జరగక తప్పదా? అంటే అంటే తన జీవితకాలం ఇంకా పదేళ్ళు మాత్రమే నన్నమాట!! తను మరణిస్తే సుమతి. తన ఇద్దరు బిడ్డల గతి ఏం కాను? జీవితం వడ్డించిన విస్తరిలా వుంది దానిని



పూర్తిగా అనుభవించక ముందే తను మరణిస్తాడు

రాజారావు బెంగపడిపోయాడు సీటి గండానికి సంబంధించిన ఆలోచనలు అతన్ని అనుక్షణం వెన్నాడసాగాయి. కొంత మంది జోతిష్కుల దగ్గర చెయ్యి చూపించుకుని తన ఆయుష్షు గురించి అడి గాడు వాళ్ళందరూ అతను డెబ్భై ఏళ్ళ పైగా బ్రతుకుతాడని చెప్పారు అతనికే గండమూ వుండబోదని చెప్పారు వేరే విషయాలైతే అతడు అంతగా పట్టించు కునే వాడు కాదు—కాని ఇది తన ప్రాణా నికి సంబంధించిన విషయమాయె! అందుకనే తన మనస్సుకు సర్ది చెప్పుకో లేక సతమతమైపోతున్నాడు అయితే ఒకటి—తనకా గండం తప్పితే తను డబ్భై ఏళ్ళు బ్రకుకుతాడని ఆ జోతిష్క చక్రవర్తి చెప్పాడు అసలు అతను చెప్పి నప్పుడే తను శాంతి చేయించవలసింది అప్పట్లో తనకు వీటి మీద అంత నమ్మకం లేదు. ఇప్పుడు అదే తన కొంపల మీదికి తెచ్చింది అనుకున్నాడు రాజారావు. అతను తన అవివేకానికి అదేపనిగా బాధ పడసాగాడు

రాజారావు మనోవ్యధతో రోజు రోజుకూ చిక్కి శల్యమైపోసాగాడు. ఇంకా తను పదేళ్ళు బ్రతుకుతాడు ఇంకా తొమ్మిదేళ్ళ మూడువందల అరవై నాలుగు రోజులు అరవై మూడు రోజులు

ఇలా అతను ప్రతీరోజు తన ఆయు వును లెక్కబెట్టుకుంటున్నాడు

"ఏమిటోయ్! ఈ మధ్య నువ్వు మరీ అలా చిక్కిపోతున్నావ్? " అంటూ కనిపించిన ప్రతి ఒక్కరూ అతనిని అడగ సాగారు. తన మనసులోని భయాలనూ సందేహాలను ఇతరుల ముందు వ్యక్తం చెయ్యడం అతనికి యిష్టం లేదు. ఎవ్వరికీ ఆ విషయం చెప్పకుండా అతను తనలో

తానే కుమిలిపోసాగాడు సుమతికి కూడా తన నీటిగండం విషయం చెప్పలేదు. అనవసరంగా ఆమెను కూడా భయ పెట్టడం ఎందుకని అతని అభిప్రాయం

ఆ రోజు ఉదయం రాజారావు వీధి వరండాలో పేపరు చదువుతూ కూర్చుని వున్నాడు.

"లోపలికి రావచ్చాండీ" ఎవరిదో గొంతు వినిపిస్తే రాజారావు తలెత్తి చూశాడు ఎదురుగా అతి గినయంగా చేతులు కట్టుకుని నిలబడివున్న పరమేశం కనిపించాడు. రాజారావుకు తనకు లాట రీలో లక్ష తగిలినప్పుడు కూడా అంత ఆనందం కలగలేదు

"ఒరేయ్ ఒరేయ్. .దొంగ భడవా, చాల్లే వెధవ్వేషాలు సరిగ్గా నిలబడు" అంటూ ఒక్క ఉదుటున కుర్చీలోంచిలేచి పరమేశాన్ని కౌగలించుకున్నాడు ఈ మధ్యకాలంలో రాజారావులో అందులో పదోవంతు ఉత్సాహమైనా కలగలేదు

"నువ్వేమో లక్షాధికారివై పోయావు! ఏమో మేము గుర్తుంటామో లేదోనని భయపడ్డాను" అన్నాడు పరమేశం నవ్వుతూ.

"నీకు మాత్రం తక్కువేమైంది. గెజిటెడ్ ఆఫీసరువి! ఇంతకూ ఎక్కడ నుండి రావడం? ఏమైనా పనుండి వచ్చావా? లేక మా మీద దయ కలి గిందా? మీ వాళ్ళందరూ ఎలావున్నారు? బుజ్జిగాడి తరువాత మళ్ళీ ఏమైనా?" ఇలా ప్రశ్నమీద ప్రశ్న వేశాడురాజా రావు—పరమేశం చేతిలోని సూట్‌కేస్ అందుకుంటూ

"నువ్విలా ప్రశ్నల వర్షం కురిపిస్తూనే వుంటావా? లేక కాఫీ ఏర్పాటేమైనా వుందా?" అన్నాడు పరమేశం.

"కాఫీదేం భాగ్యమోయ్ పద లోపలికి పోయి కూర్చుందాం ఆ! స్నానానికి వేడినీళ్ళా చన్నీళ్ళా!"

"ఇంత చలేస్తుంటే వేణ్ణీళ్లా చన్నీళ్లా అని విడిగా అడుగుతావేమిటి?"

రాజారావు సుమతితో పరమేశం వచ్చి నట్లు చెప్పడానికీ, అతనికి స్నానానికి భోజనానికి ఏర్పాట్లు చెయ్యడానికి లోపలికి వెళ్ళాడు

రాజారావు పరమేశం ఇద్దరూ బాల్య మిత్రులు ఒకటో తరగతి నుండి కాలేజీ చదువుల వరకూ ఇద్దరూ కలిసి చదువు కున్నారు—కలిసి తిరిగారు ఉద్యోగరీత్యా చెరో వూరు వెళిపోయి విడిపోవలసి వచ్చింది అప్పుడప్పుడు వీలు చిక్కి నప్పుడు రాజారావు పరమేశం దగ్గరికి వెళ్ళడమో, లేదా పరమేశం రాజారావు దగ్గరికి రావడమో చేస్తుండేవార ...రికీ సంసార బాధ్యతలు పెరిగా... బట్టి ఇప్పుడు కాస్త రాకపోకలు తగ్గాయి. పరమేశం రాజారావు పెళ్ళికి రావడమే ఆ తరువాత ఇద్దరూ కలుసుకోలేదు

భోజనాలయిన తరువాత మిత్రులిద్దరూ చిన్నప్పటి విషయాలనుచర్చించుకున్నారు సుమతి తన భర్తలో ఇదివరకటి ఉత్సాహం చూపింది తనకు ముఖ్యమైన పనులు కొన్ని ఉన్నాయని అందుచేత అక్కడ రెండు రోజుల కంటే ఎక్కువ వుండడానికి వీల్లేదని పరమేశం అన్నాడు రాజారావు ఆ రెండు రోజు

లకూ శలవు చీటి రాసి నౌకరుతో ఆఫీసుకు పంపించాడు. మధ్యాహ్నం వరకూ వాళ్ళు అట్లానే మాటలతో సర్దాగా గడిపి కాస్సేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం సినిమాకు వెళ్ళారు.

రాత్రి భోజనాల తరువాత రాజారావు పరమేశం ఇద్దరూ డాబామీదకు వెళ్ళిపోయారు. మాటల మధ్యలో పరమేశం కూడా అందరూ అంటున్న మాటనే రాజారావుతో అన్నాడు.

"ఏమిటోయ్ .... నువ్వు మరీ చిక్కిపోయినట్లున్నావ్?... ఒంట్లో బావుండటం లేదా? ...."

రాజారావు కాస్సేపు తటపటాయించి అసలు విషయం చెప్పేశాడు.

"అబ్బే.... నువ్వు అనవసరంగా భయపడుతున్నావోయ్ .... నీటిగండం లేదు బొంద లేదు.... అనవసరంగా లేని పోని భయాలు మనసులో పెట్టుకోకు ...." అంటూ రాజారావు మాటల్ని తేలికగా కొట్టివేశాడు పరమేశం.

రాజారావు అది అంత తేలికగా కొట్టి పారేసే విషయం కాదనీ — ఇదివరకు జ్యోతిష్కులు చెప్పిన విషయాలు తన పట్ల ఏయేవిధంగా నిజమైనాయో పరమేశంతో చెప్పాడు.

"అయినా అంత కంగారుపడవలసింది ఏముంది?... నీకు నీటిగండం ఉందంటు

న్నావు కదా? నువ్వు ఈత నేర్చుకుంటే సరిపోతుందిగా? "

"ఈ వయసులో నాకు ఈత వస్తుందంటావా? " రాజారావు తన సందేహాన్ని వ్యక్తపరిచాడు

"ఎందుకు రాదూ? ఈత నేర్చుకోవడం ఏమంత కష్టమైన పని కాదు" అన్నాడు పరమేశం

ఊరికి వెళ్ళేముందుకూడా బస్స్టాండు దగ్గర ఈత నేర్చుకోమని రాజారావుతో మరీమరీ చెప్పాడు పరమేశం

పరమేశం వెళ్ళిపోయిన ఒకటి రెండు రోజులకే రాజారావు ఈత నేర్చుకోవడం మొదలుబెట్టాడు రాజారావు ఇంటికి నాలుగిళ్ళ అవతల ఉన్న ఒకాయనకు ఈత బాగా వచ్చు సాయంత్రం ఆయన రాజారావును తీసుకు వెళ్ళి రోజూ ఈత నేర్పిస్తున్నాడు ఒక రెండు వారాల్లోనే రాజారావు బాగా ఈదడం నేర్చుకున్నాడు రోజూ సాయంత్రం నియమంతప్పకుండా ఈతకు వెళ్తున్నాడు రాజారావు అది ఇప్పుడు అతని నిత్యకృత్యాలలో ఒకటిగా అయిపోయింది రోజులు గడిచిపోతున్నాయి.

ఇప్పుడు రాజారావుకు నలభై ఏళ్ళు నిండాయి అతనిప్పుడు గజ ఈతగాడు. తనకిప్పుడు నీటిగండం లేదని అనుకున్నాడు గానీ ఆ రోజు సుబ్బయ్య మరణవార్త విన్నాక అతనిలో ధైర్యం మళ్ళీ సన్నగిల్లింది

సుబ్బయ్య ఎండలో బాగా తిరిగి ఇంటికి వచ్చి దాహానికి కాస్సేపయినావేచి ఉండక వెంటనే మంచినీళ్ళు త్రాగబోయి గుటకపడక గుండెల్లో పట్టుకుని మరణించాడు సుబ్బయ్య మంచి నీళ్ళు త్రాగబోయి మరణించాడు ఇది నీళ్ళవల్ల సంభవించిన మరణంగాబట్టి దీన్నికూడా నీటి గండమనే అంటారా? మరైతే తను ఈత నేర్చుకుని ఏం లాభం? నీటి గండం తనకు సుబ్బయ్యకు సంభవించిన విధంగా మరో రకంగా సంభవిస్తే?

రాజారావు మళ్ళీ బెంగపెట్టుకున్నాడు

ఆ రోజు శలవురోజు కావడంమూలాన రాజారావు మిత్రులు పిక్నిక్ ప్రోగ్రాం వేసుకున్నారు. ఊరి చివర మామిడి తోటకు వెళ్ళారు అంతా కలిపి పదిమంది వరకూ ఉంటారు వాళ్ళు మధ్యాహ్నం వరకూ చెస్, పేకాట ఆడుతూ సరదాగా కాలం గడిపారు మధ్యాహ్నం తమకూడా తెచ్చుకున్న ఫలహారాలు తినేశారు తరువాత కొంతసేపు ఒకాయన పాటలు పాడేడు ఆ తరువాత ట్రాన్సిస్టరు వింటూ కబుర్లు చెప్పుకుంటూ సాయంత్రంవరకూ గడిపేశారు

"కాస్సేపు చెర్లో ఈత కొడదామేమిటీ? " ఎవరో తన కోరికను వ్యక్తం చేశారు

"ఇక్కడ చెరువేదీ? "

"ఇక్కడికి ఒక ఫర్లాంగు దూరంలో ఉంది రండి నేను తీసుకువెళ్తాను "

"మరి మాకు ఈత రాదే! "

"రాజారావూ నేనూ ఈత కొడ్తాం . మీరందరూ చెఱువుగట్టుమీద కూర్చోండి. ఆ స్థలం బావుంటుందిలే" అన్నాడతను.

అందరూ అక్కడికి బయలుదేరారు

రాజారావూ అతను కాస్సేపు ఈత కొట్టారు. అతని స్నేహితులు ఏవైనా వస్తువులు నీళ్ళలోకి విసుర్తే రాజారావు

ఈదుకుంటూ వెళ్ళి వాటిని మళ్ళీ బయటికి తీసుకొస్తున్నాడు. వాళ్ళు ఆశ్చర్యపడు తున్నకొద్దీ రాజారావులో ఉత్సాహం పెరగసాగింది ఎవరో కుండపెంకు ఒకటి చెరువు మధ్యకి విసిరారు రాజారావు దానిని తీసుకురావడంకోసం చెరువు మధ్యకు ఈదుకుంటూ వెళ్ళాడు ఒక్క సారి బాగా ఊపిరి తీసుకుని లోపలికి మునిగిపోయాడు ఎట్లాగయితేనేం కష్ట పడి వెతికి దాన్ని దొరకపుచ్చుకున్నాడు ఉన్నట్లుండి రాజారావుకు తన నీటిగండం గురించి గుర్తుకు వచ్చింది తనకు నలభై ఏళ్ళు నిండాయి కొంపతీసి తనకు ఇప్పుడా నీటిగండం సంభవించదుకదా! రాజారావు గుండె కొన్నిక్షణాలు భారంగా కొట్టుకుంది ఆ సమయంలో అతను నీళ్ళలోంచి బయటికి వద్దామని అను కుంటూండగా అతని కాళ్ళకు పామొ కటి చుట్టుకుంది రాజారావు శరీరం బిగు సుకు పోయింది పాములంటే అతనికి చచ్చేంత భయం నీటిపాములవల్ల అంత ప్రమాదం లేదని విన్నాడు గానీ ఏమో! వాటిల్లోకూడా విషపూరితమైనవి ఉంటాయేమో' రాజారావు కాలు గట్టిగా విదిలించాడు నీళ్ళల్లో తను ఎంత బలంగా కాలు ఊపుదామన్నా కుదరడంలేదు పాము కాలికి మరింతగా చుట్టుకున్నట్లు అనిపించింది తనకు నలభై ఏళ్లు నిండి పోయాయి తనిప్పుడు నీళ్ళల్లో పామువాత పడి చావబోతున్నాడు రాజారావులో ధైర్యం సన్నగిల్లింది అతనికి తనభార్యా పిల్లలు గుర్తుకు వచ్చారు. ఎక్కడలేని ధైర్యంతెచ్చుకుని చేత్తో తనకాలుకు చుట్టు కున్న పామును లాగబోయాడు. కాని అది మరింతగా చుట్టుకుపోయింది రాజారావుకు భయంవేసింది త్వరగా ఒడ్డుకు చేరదా మనే ప్రయత్నంలో ఉండగా కాలుకు చుట్టుకున్న పాము అతన్ని కాటువేసింది రాజారావు కాళ్లూ చేతులూ ఆడటం మానే శాయి "హెల్ప్ హెల్ప్ " అంటూ అరిచాడు ఒడ్డున ఉన్న స్నేహితులు అతను ఊరికే తమాషా చేస్తున్నాడని అనుకున్నారు గజ ఈతగాడు! అతనికి సహాయమేమిటనుకున్నారు

రాజారావు కాళ్ళలోంచి విషం మెల్లగా ఒళ్ళంతా ప్రాకినట్లు భావించాడు అతని మెదడు మొద్దుబారింది తన ఆయువు తీరి పోయింది తను మరణిస్తున్నాడు! పాము మళ్ళీ కరిచినట్లయింది విషం మెదడులోకి ఎక్కినట్లు ఫీలయ్యాడు అతను కాళ్లూ చేతులు ఇప్పుడు అతని స్వాధీనంలోంచి పూర్తిగా తప్పు కున్నాయి నీళ్ళలో మునిగిపోయేముందు మరోసారి బలహీనంగా "రక్షించండి పాము. మునిగిపోతున్నాను "అన్నాడు రాజారావు

మునిగిన రాజారావు ఎంతకూ తేలక పోయేసరికి స్నేహితులకు అనుమానం వచ్చింది ఒకడు ఈదుకుంటూ లోపలికి వెళ్ళి చూసొచ్చి ఆయాసపడుతూ రాజా రావు చచ్చిపోయాడని చెప్పాడు దారిన పోయే ఇద్దరు ఆసాముల సహాయంతో రాజారావు శవాన్ని బయటకు తీశారు

రాజారావు కాలుకు ఒక నల్లని గుడ్డ పేలిక చుట్టుకుపోయి ఉంది ఆ గుడ్డపేలి కకు ఒక చిన్న ముళ్ళకంచెకూడా చిక్కు కుని ఉంది! □